# అభివృద్ధికే తెలంగాణ ప్రజల మద్దతు

**• బీఆర్ఎస్ అంబర్‌పేట అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ • నాయకులతో కలిసి కాలనీల్లో ముమ్మర ప్రచారం**



బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు మద్దతు ప్రకటిస్తున్న బర్కత్‌పుర జైన్ కమ్యూనిటీ వాసులు



కాచిగూడ జైన్‌మందిర్‌లో అశీర్వవాదం తీసుకుంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ:నవంబర్ 15: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావడంతో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని విశ్వసిస్తూ మద్దతు ప్రకటిస్తున్నారని ఆ పార్టీ అంబర్‌పేట అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని పలు అపార్ట్‌మెంట్లలోని 650మంది జైన్ కమ్యూనిటీ వాసులు అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిని చూసి రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజలంతా సీఎం కేసీఆర్ విజన్‌ను కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగుతుందని, అందుకే వారంతా బీఆర్ఎస్ వైపుమొగ్గు చూపుతూ, సీఎం కేసీఆర్ పరిపాలనకు జేజేలు పలుకుతున్నారని తెలిపారు. పేదల సంక్షేమం విషయంలో సీఎం కేసీఆర్ రాజీపడే ప్రసక్తే లేదని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పులిజాల గెల్వాయ్య, సునీల్, యోగేశ్, ప్రణయ్, శ్రీనివాసులు, అనిల్‌జైన్, రఘు, రాకేశ్, మనోజ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, ప్రతిభ, నర్సింహ పాల్గొన్నారు.



జైనమత పెద్దను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్



రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న కాలేరు వెంకటేశ్



న్యూనల్లకుంటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సతీమణి పద్మ

## మరోసారి గెలిపించండి..
## మరింత అభివృద్ధి చేస్తా.. : ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రత్యర్థుల అంచనాలకు అందకుండా ప్రచారంలో కారు దూసుకుపోతున్నది. మోసపూరిత వాగ్దానాలతో ముందుకు వస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాల ముందు నిలువలేవని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా...రెండోసారి అవకాశం ఇవ్వండి మరింత అభివృద్ధి చేస్తానని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం కాచిగూడలోని జైన్‌మందిర్‌లైన్, వెంకటరమణ థియేటర్ లైన్, బర్కత్‌పురా తదితర ప్రాంతాల్లో వందలాది మంది కార్యకర్తలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ ఊపిరి ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని, మరోసారి అశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక సదుపాయాలన్నీ కల్పించామని, కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాంచందర్‌రాజు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, నాయకులు బండ సూరి, సునీల్‌బిడ్లాన్, కె.సదానంద్, ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి, శేషు, బి.కృష్ణాగౌడ్, ఎల్.రమేశ్, మహేశ్‌కుమార్, శ్రీకాంత్‌యాదవ్, శాంతి, ప్రతిభ, నర్సింహారెడ్డి, అశోక్, సతీశ్, మహేందర్,క్రాంతి, శ్రీకాంత్‌ముదిరాజ్, శ్రీశైలం, బబ్లూ, అంటోని, నర్సింగ్‌బాబు, కిశోర్, బబ్బి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సతీమణి పద్మ ప్రచారం

అంబర్‌పేట : బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సతీమణి కాలేరు పద్మ బుధవారం నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంట, బ్రాహ్మణ హాస్టల్ లేన్‌లో ప్రచారం చేపట్టారు. పార్టీ మహిళా నాయకులు కవితా రావు, పల్లె భారతిరెడ్డి, పద్మజ ముదిరాజ్, రమ్య తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

## ఇంటింటి ప్రచారం

గోల్నాక : అంబర్‌పేట డివిజన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి బొట్టు పెడుతూ.. ఓటర్ల ఓటు అభ్యర్థిస్తున్నారు. బుధవారం స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బాపునగర్‌లో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మహిళా నాయకులు ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు బొట్టు పెట్టి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

## మార్నింగ్ వాకర్స్‌ను కలిసిన కాలేరు

అంబర్‌పేట : బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బుధవారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీ కమాన్ వద్ద మార్నింగ్ వాకర్స్‌ను కలిసి మద్దతు కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలను వివరించారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను కలిసి కరపత్రం అందించి ఓటు అభ్యర్థించారు.



బాపునగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఓటు వేయాలని వృద్ధురాలిని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు



దివ్యాంగులకు భోజనం వడ్డిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## 19న మంత్రి కేటీఆర్ రోడ్‌షో



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ:నవంబర్ 15: అలుపెరగని యువ నాయకుడు, పరిపాలనాదక్షుడు, మంత్రి కేటీఆర్‌కు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం కాచిగూడ ఎన్నికల కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో ఎమ్మెల్యే మాట్లాడారు. మంత్రి కేటీఆర్ ఈనెల 19న రోడ్‌షోలో భాగంగా చెప్పల్‌బజార్‌కు రానున్నారని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అన్ని బస్తీ, కాలనీలలో తిరుగుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయాలని సూచించారు.అంబర్‌పేటలో గులాబీ జెండా ఎగురవేసి,సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాంచందర్‌రాజు, బీఆర్ఎస్ నాయకులు బండ సూరి, సునీల్‌బిడ్లాన్, ఎర్ర భీష్మాదేవ్, కె.సదానంద్, నాగేందర్ బాబ్జి, శేషు, కృష్ణాగౌడ్, ఎల్.రమేశ్, మహేశ్‌కుమార్, శ్రీకాంత్‌యాదవ్, శాంతి, ప్రతిభ, నర్సింహారెడ్డి, బుచ్చిరెడ్డి,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అంబర్‌పేట బరిలో 20మంది అభ్యర్థులు

అంబర్‌పేట, నవంబర్ 15 : నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అంబర్‌పేట నియోజకవర్గంలో 20 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 27 మంది నామినేషన్లు వేయగా ఏడుగిరి నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. మిగిలిన 20 మంది అభ్యర్థులు ఒక్కరు కూడా నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదు. కాగా ప్రధాన పార్టీల అభ్యర్థులుగా బీఆర్ఎస్ నుంచి కాలేరు వెంకటేశ్, బీజేపీ నుంచి సి.కృష్ణాయాదవ్, కాంగ్రెస్ నుంచి సి.రోహిణ్‌రెడ్డి, బీఎస్పీ నుంచి అన్వర్‌ఖాన్, ఇతరులు ఓంసింగ్ రాజ్‌పురోహిత్, ధర్మేందర్ తివారీ, నల్ల ఉదయ్‌కుమార్, ఇ.భాస్కర్‌రావు, ముప్పిడి వాసుదేవరావు, అముడ అరుణ్‌కుమార్, దేవరుప్పల శ్రీకాంత్, మంగిలిపల్లి శంకర్, మాలిక్ ముక్తార్ మోహియుద్దీన్, పి.రాజేశ్, వి.సంతోష్, సయ్యద్ మోహిసినుద్దీన్, సుదర్శన్ ఆంధ్రప్పు, శ్రీనాథ్ లంకదాసరి, ఎం.శ్రీనివాస్ రంగంలో ఉన్నారు. అయితే వీరందరికీ గుర్తులు కేటాయించారు.

## సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం



సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జే లక్ష్మణ్‌నాయక్‌కు మరో యేడాది పాటు కొనసాగిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్‌ను అధ్యాపక బృందం, విద్యార్థులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

– సుల్తాన్‌బజార్, నవంబర్ 15

## ‘సేవా భావంతో పనిచేసినప్పుడే గుర్తింపు’



మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేస్తున్న సంఘ సేవకుడు గండికోట జనార్దన్, తదితరులు

కాచిగూడ, నవంబర్ 15: సేవా భావంతో పనిచేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, ప్రతి ఒక్కరూ మానవత దృక్పథంతో ముందుకు సాగాలని ప్రముఖ సంఘసేవకుడు గండికోట జనార్దన్ అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని బుధవారం గోల్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సఫాయి కార్మికులు, మహిళలకు ఉచితంగా చీరలు, స్వీట్‌బాక్స్‌లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం గండికోట జనార్దన్ మాట్లాడుతూ ప్రతి ఏటా దీపావళి సందర్భంగా 300 మంది మహిళలు, కార్మికులకు చీరలు, స్వీట్‌బాక్స్‌లను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పలువురు పాల్గొన్నారు.